‘ప్రెస్‌వు’ ఐ డ్రాప్స్‌కు అనుమతి రద్దు

- ఈ డ్రాప్స్‌తో కళ్లద్దాల అవసరం తగ్గుతుందని ప్రకటించిన కంపెనీ
- ప్రకటన సరైనది కాదన్న డీసీజీఐ
- గతంలో ఇచ్చిన అనుమతి రద్దు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: ముంబైకు చెందిన ఎన్టాడ్ ఫార్మాస్యూటికల్స్ ఇటీవల ఆవిష్కరించిన ‘ప్రెస్‌వు’ ఐ డ్రాప్స్‌కు డీసీజీఐ అనుమతి రద్దు చేసింది. ఈ ఐ డ్రాప్స్‌కు డీసీజీఐ ఆగస్టులో అనుమతి ఇచ్చింది. ప్రెస్బియోపియాతో బాధపడుతున్న వారు తమ ఐ డ్రాప్స్ వాడితే కళ్లద్దాల అవసరం తగ్గుతుందని ఈ కంపెనీ ప్రకటించింది. ‘రీడింగ్ గ్లాసెస్ అవసరాన్ని తగ్గించేందుకు భారత్‌లో తయారు చేసిన మొదటి ఐ డ్రాప్’ అని వెల్లడించింది. ఈ ప్రకటనపై వివరణ ఇవ్వాలని డీసీజీఐ సెప్టెంబర్ 4న కంపెనీని ఆదేశించింది. ప్రెస్బియోపియా చికిత్సకు భారత్‌లో ఇప్పటివరకు ఏ ఐ డ్రాప్స్‌కు అనుమతి లేనందున ఈ ప్రకటన చేసినట్టు కంపెనీ వివరణ ఇచ్చింది. అయితే, కళ్లద్దాల అవసరాన్ని తగ్గించేందుకు ఈ ఐ డ్రాప్స్ పని చేస్తాయని చెప్పుకోవడానికి అనుమతి లేదని పేర్కొన్న డీసీజీఐ, దాని అనుమతిని రద్దు చేసింది. దీనిని కోర్టులో సవాల్ చేస్తామని సంస్థ సీఈఓ నిఖిల్ కే మసూర్కర్ తెలిపారు.

రాహుల్ వ్యాఖ్యలకు
ఉగ్రవాది పన్నూ మద్దతు

- మా ఖలిస్థాన్ డిమాండ్‌ను సమర్థించేలా ఉన్నాయి: పన్నూ
- రాహుల్ వ్యాఖ్యలకు నిరసనగా ఢిల్లీలో సిక్కుల ఆందోళన
- ఇల్హాన్ ఒమర్‌తో రాహుల్ గాంధీ సమావేశంపైనా వివాదం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: ‘భారత్‌లో ఓ సిక్కు టర్బన్, కడెం ధరించేందుకు, గురుద్వారాకు వెళ్లేందుకు అనుమతి ఉంటుందా అనే దానిపై పోరాటం జరుగుతున్నది’ అంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ఖలిస్థానీ ఉగ్రవాది, సిక్స్ ఫర్ జస్టిస్ సహ వ్యవస్థాపకుడు గురుపత్వంత్ సింగ్ పన్నూ సమర్థించారు. అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియాలో జరిగిన ఓ కార్యక్రమంలో సోమవారం రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ వ్యాఖ్యలపై స్పందించిన పన్నూ.. భారత్‌లో సిక్కులకు ఉన్న ముప్పుపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు ధైర్యంతో, మార్గదర్శకంగా చేసినట్టు ఉన్నాయని పేర్కొన్నారు. భారత్‌లో 1947 నుంచి సిక్కులు ఎదుర్కొంటున్న వాస్తవిక పరిస్థితులను చాటేలా రాహుల్ వ్యాఖ్యలు ఉన్నాయని, తమ ఖలిస్థాన్ ఏర్పాటు డిమాండ్‌ను సమర్థిస్తున్నాయని పేర్కొన్నారు. కాగా, రాహుల్ వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం ఢిల్లీలోని ఆయన నివాసం వద్ద సిక్కులు ఆందోళనకు దిగారు.

భారత వ్యతిరేకితో సమావేశమా?

అమెరికా పర్యటనలో భాగంగా అక్కడి హౌజ్ ఆఫ్ రిప్రజెంటేటీవ్స్ సభ్యురాలు ఇల్హాన్ ఒమర్‌తో రాహుల్ గాంధీ సమావేశం కావడం దుమారం రేపుతున్నది. తరచూ భారత వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తూ, అమెరికా చట్టసభలో భారత్‌కు వ్యతిరేకంగా తీర్మానాలు ప్రవేశపెట్టే ఇల్హాన్‌తో రాహుల్ సమావేశం కావడాన్ని బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. 2022 ఏప్రిల్‌లో ఆమె పీఓకేలో పర్యటించి, పాక్ నేతలతో భేటీ అయిన విషయాన్ని బీజేపీ నేత షెహ్‌జాద్ పూనావాలా గుర్తుచేశారు. ఆమె ఆర్టికల్ 370 రద్దును, ఎన్ఆర్‌సీని వ్యతిరేకించారని పేర్కొన్నారు. అనేకసార్లు భారత్‌కు వ్యతిరేకంగా నిలిచిన ఇల్హాన్ ఒమర్‌ను రాహుల్ ఎందుకు కలవాల్సి వచ్చిందని, బీజేపీ విరోధి అయితే దేశ విరోధి అయినా కలుస్తారా అని ఆయన ప్రశ్నించారు.

ఎస్ఎఫ్‌జేపై నిషేధం మరో ఐదేండ్లు పొడిగింపు

న్యూఢిల్లీ: ఖలిస్థాన్ అనుకూల సిక్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జే)పై నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం మరో ఐదేండ్లు పొడిగించింది. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకు ఈ సంస్థపై ఐదేండ్ల క్రితం నిషేధం విధించింది. పంజాబ్, తదితర చోట్ల దేశ సమగ్రత, భద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాలను కొనసాగిస్తున్నందుకు ఈ సంస్థపై నిషేధాన్ని మరో ఐదేండ్లు పొడిగించినట్టు కేంద్ర హోం శాఖ బుధవారం తెలిపింది.

వాల్మీకి స్కామ్ నిధులతో
కాంగ్రెస్ ప్రచారం!

- కర్ణాటక కుంభకోణంలో దారిమళ్లిన సొమ్ము హైదరాబాద్‌కు
- తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలకు మద్యం కొనుగోళ్లు
- ఈడీ చార్జ్‌షీట్‌లో వెలుగులోకి వచ్చిన కీలక విషయాలు
- మాజీ మంత్రి నాగేంద్ర పీఏ విజయ్ ఫోన్‌లో ఆధారాలు

బెంగళూరు, సెప్టెంబర్ 11: కర్ణాటక వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌లో కీలక విషయాలు వెలుగు చూస్తున్నాయి. గిరిజనుల సంక్షేమం కోసం ఉపయోగించాల్సిన నిధులతో తెలంగాణ కాంగ్రెస్ కోసం మద్యం కొనుగోళ్లు జరిగాయని తెలుస్తున్నది. ఎన్నికల ప్రచారానికీ ఈ నిధులను వినియోగించినట్టు సమాచారం. ఈ మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మంగళవారం ప్రజాప్రతినిధుల కోర్టులో దాఖలు చేసిన చార్జ్‌షీట్‌లో కీలక అంశాలు ఉన్నట్టు ఓ జాతీయ మీడియా సంస్థ కథనం ప్రచురించింది. దీని ప్రకారం.. కర్ణాటక మాజీ మంత్రి, కాంగ్రెస్ కీలక నేత బీ నాగేంద్ర వ్యక్తిగత సహాయకుడు విజయ్ కుమార్ గౌడ మొబైల్ ఫోన్‌లో దొరికిన ఆధారాలతో ఈ బండారం బయటపడింది. కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి దారి మళ్లించిన డబ్బుల్లో దాదాపు రూ.20 కోట్లు తెలంగాణకు వచ్చాయి. ఈ డబ్బులతో లోక్‌సభ ఎన్నికల సమయంలో తెలంగాణలో మద్యం కొనుగోళ్లు జరిగాయి. ఎన్నికల ప్రచారానికీ ఈ డబ్బులను వినియోగించారు. ఈ స్కామ్‌లో హైదరాబాద్‌కు చెందిన బిల్డర్ సత్యనారాయణ వర్మ కీలకంగా వ్యవహరించారు. కాగా, సత్యనారాయణ వర్మకు తెలంగాణకు చెందిన ఇద్దరు కాంగ్రెస్ కీలక నేతలు సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ప్రచారం జరుగుతున్నది.

ఈడీ చేతికి పక్కా ఆధారాలు

వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌ను కర్ణాటక ప్రభుత్వం సిట్ ద్వారా విచారించింది. ఈ స్కామ్‌లో మాజీ మంత్రి బీ నాగేంద్ర పాత్రనే లేదని సిట్ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. అయితే, ఇదే కేసును దర్యాప్తు చేసిన ఈడీ మాత్రం ఈ కుంభకోణంలో అసలు విషయాలను బయటపెట్టింది. ఈ మేరకు 5,114 పేజీల చార్జిషీట్‌ను దాఖలు చేసింది. ఇందులో 15 మంది సాక్షుల స్టేట్‌మెంట్‌లను సైతం పొందుపరిచింది. నాగేంద్ర, సత్యనారాయణ వర్మతో పాటు తెలంగాణకు చెందిన ఇటకరి సత్యనారాయణ, కార్పొరేషన్ మాజీ ఎండీ జేజీ పద్మనాభ సహా 20 మంది పేర్లను చార్జిషీట్‌లో ప్రస్తావించింది.

కాంగ్రెస్ ఖర్చు చేసింది
వాల్మీకి స్కామ్ సొమ్మే

- పార్లమెంటు ఎన్నికలకు వాడుకుంది
- నిందితులను కఠినంగా శిక్షించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): కర్ణాటక వాల్మీకి స్కామ్ సొమ్మునే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఖర్చు చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వాల్మీకి స్కామ్‌పై తాము మొదటి నుంచి చెప్తున్నదే ఇప్పుడు నిజమని తేలిందన్నారు. గిరిజనుల బాగు కోసం ఖర్చు చేయాల్సిన సొమ్మును ఎన్నికల ప్రచారం కోసం వాడుకున్న కాంగ్రెస్ పార్టీ నేతలను శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. వాల్మీకి కుంభకోణంలో కాంగ్రెస్ నేత, కర్ణాటక మాజీ మంత్రి బీ నాగేంద్రనే కీలక సూత్రధారి అని ఈడీ తన చార్జిషీట్‌లో నిర్ధారించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ఉటంకించారు. కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన రూ.187 కోట్లు అప్పటి కాంగ్రెస్ మంత్రి చేతులమీదుగా దారిమళ్లాయని పేర్కొన్నారు. ఆ స్కామ్‌లో ప్రధాన నిందితుడు సత్యనారాయణ వర్మ తెలంగాణకు చెందిన ఇద్దరు కీలక కాంగ్రెస్ నేతలకు అత్యంత సన్నిహితుడని ఆరోపించారు. సత్యనారాయణ వర్మ వ్యాపారంలోనూ కాంగ్రెస్ నేతలు భాగస్వాములుగా ఉన్నట్టు అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కుంభకోణంలో ఇంకా అనేక మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన పెద్దలు ఉన్నారనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదని అన్నారు. ఈ కుంభకోణంపై దర్యాప్తు సంస్థలు లోతుగా విచారించి నిజానిజాలను నిగ్గుతేల్చాలని, దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

అత్యాచార నిందితులకు మద్దతిచ్చిన వ్యక్తికి సీటా?

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కథువా అత్యాచారం కేసులో నిందితులకు మద్దతుగా నిలిచిన లాల్‌సింగ్ అనే వ్యక్తికి కాంగ్రెస్ అసెంబ్లీ టికెట్ ప్రకటించటం సిగ్గుచేటని కేటీఆర్ మండిపడ్డారు. నారీ న్యాయ్ అంటూ గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ రేపిస్టులను సమర్థించిన వ్యక్తికి సీటు ఎలా కేటాయిస్తుందని ప్రశ్నించారు. కథువా అత్యాచారాన్ని సమర్థించిన వ్యక్తికి సీటు కేటాయించి, అదే ఘటనలో బాధితుల తరపున పోరాడుతున్నట్టు కాంగ్రెస్ ఎలా చెప్పుకుంటుందని నిలదీశారు.

సీఎం పదవి ఖాళీగా లేదు

- పూర్తి కాలం నేనే సీఎంగా ఉంటా
- సీఎం సిద్ధరామయ్య స్పష్టీకరణ

బెంగళూరు: ముడా కుంభకోణం, ఇతర అవినీతి ఆరోపణల నేపథ్యంలో తనను పదవి నుంచి తొలగిస్తారని జరుగుతున్న ప్రచారాన్ని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఖండించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి పదవి ఖాళీగా లేదని, ఎలాంటి సందేహం లేకుండా తానే పూర్తి కాలం ఈ పదవిలో కొనసాగుతానని ఆయన స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో సిద్ధరామయ్యను తొలగిస్తారని వార్తలు రావడంతో ఆ పదవిని చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని ఇప్పటికే పలువురు కాంగ్రెస్ నేతలు బహిరంగంగా తమ కోరికను వ్యక్తం చేశారు. దీనిపై సిద్ధు స్పందిస్తూ ‘ఎవరూ ఎలాంటి ప్రకటనా ఇవ్వలేదు. ఎవరూ తాము ముఖ్యమంత్రిని అవుతామని ప్రకటించలేదు. అయినా సీఎం పదవి ఖాళీగా లేదు. అలాంటప్పుడు ఎవరైనా ముఖ్యమంత్రి అవుతామని ఎందుకు అంటారు. అందరూ చెప్పేదేమిటంటే సిద్ధరామయ్యే ముఖ్యమంత్రిగా కొనసాగుతారు’ అని పేర్కొన్నారు.

సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నివాసంలో గణపతి పూజకు ప్రధాని మోదీ హాజరయ్యారు. కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థ మధ్య అధికారాల విభజన విషయంలో సీజేఐ రాజీ పడ్డారని, సీజేఐ స్వతంత్రతపై నమ్మకం పోయిందని లాయర్ ఇందిరా జైసింగ్ విమర్శించారు.

ఐఐటీ గువాహటి డీన్ రాజీనామా

విద్యార్థి ఆత్మహత్యపై నిరసనలు వెల్లువెత్తడంతో నిర్ణయం

గువాహటి: ఐఐటీ గువాహటి అకడమిక్ అఫైర్స్ డీన్ కేవీ కృష్ణ రాజీనామా చేశారు. కంప్యూటర్ సైన్స్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి తన హాస్టల్ గదిలో సోమవారం ఉరివేసుకుని కనిపించడంతో విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఈ విద్యార్థికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నట్టు కొందరు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో కృష్ణ తన పదవికి రాజీనామా చేశారు. విద్యార్థులు సోమవారం నుంచి నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇటువంటి సంఘటనలు పదే పదే జరుగుతున్నాయని, ఇప్పటి వరకు ఈ క్యాంపస్‌లో నలుగురు విద్యార్థులు మరణించారని కొందరు చెప్పారు.

రైళ్లలో ‘క్లౌడ్ కిచెన్’ సేవలు!

తొలుత ముంబైలో

న్యూఢిల్లీ : నాణ్యమైన ఆహారం దొరకటం లేదన్న ఫిర్యాదుల నేపథ్యంలో భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పుడున్న బేస్ కిచెన్ల స్థానంలో క్లౌడ్ కిచెన్స్‌ను ఏర్పాటుచేసేందుకు ‘ఐఆర్‌సీటీసీ’ (ఇండియన్ రైల్వే కేటరింగ్, టూరిజం కార్పొరేషన్) చర్యలు చేపట్టింది. సీసీటీవీ పర్యవేక్షణ, పాక శాస్త్ర ప్రవీణులు, ఇతర నిపుణుల బృందంతో దాదాపు 200 వరకు ‘క్లౌడ్ కిచెన్ల’ను ఐఆర్‌సీటీసీ వెస్ట్ జోన్‌లో ఏర్పాటు చేయబోతున్నారు. తొలుత ముంబైలోని బేస్ కిచెన్స్‌ను క్లౌడ్ కిచెన్స్‌గా అప్‌గ్రేడ్ చేయనున్నట్టు రైల్వే అధికారులు చెప్పారు. ఇకపై వీటి నుంచే రాజధాని, శతాబ్ది, తేజస్ ఎక్స్‌ప్రెస్, వందే భారత్ రైళ్లలో ప్రయాణికులకు ఆహారాన్ని అందజేస్తారు.

గుజరాత్‌లో అంతుచిక్కని వ్యాధి

15 మంది మృత్యువాత

గాంధీనగర్: అంతుబట్టని ఓ వ్యాధి గుజరాత్‌లో కలకలం రేపుతున్నది. ముఖ్యంగా కచ్ జిల్లాలో లఖ్‌పత్, అబ్డాసా తాలూకాల్లో పరిస్థితి ఆందోళనకరంగా తయారైంది. గత కొద్ది రోజులుగా జ్వరం, నిమోనియా లక్షణాలతో బాధపడుతున్న వాళ్లలో 15 మంది చనిపోవటం కలవరపరుస్తున్నది. మృతుల్లో ఆరుగురు పిల్లలు ఉన్నారు. 11 మృతదేహాల నుంచి శాంపిల్స్ సేకరించి పుణేలోని వైరాలజీ ఇన్‌స్టిట్యూట్‌కి పంపామని కచ్ జిల్లా కలెక్టర్ అమిత్ అరోరా చెప్పారు. కారణాలేమిటో తెలుసుకోవడానికి సమయం పడుతుందన్నారు. మరణాలకు గల కారణంపై దర్యాప్తు చేపట్టామని, వైద్య బృందాలు త్వరలో నివేదికను అందజేస్తాయని ఆరోగ్య మంత్రి రిషికేశ్ పటేల్ చెప్పారు.

దేశీయ తొలి ఏరోస్పైక్ రాకెట్
ఇంజిన్ ప్రయోగం విజయవంతం

న్యూఢిల్లీ: భారత తొలి ఏరో స్పైక్ రాకెట్ ఇంజిన్ ప్రయోగం విజయవంతమైంది. కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాలో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ప్రొపల్షన్ టెస్ట్ ఫెసిలిటీలో ఈ ప్రయోగాన్ని స్పేస్‌ఫీల్డ్స్ స్టార్టప్ విజయవంతంగా పరీక్షించింది. తొలుత అసాధారణ స్థితిలో ఉన్న ఇంజిన్ క్రమంగా స్థిరత్వాన్ని సాధించిందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ ఇంజిన్ కోసం స్పేస్‌ఫీల్డ్స్ టైటానియం గ్రేడ్5ని వినియోగించింది. ఈ ప్రయోగ విజయం భారత అంతరిక్ష సాంకేతికతలో ముఖ్య ఘట్టంగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. స్పేస్‌ఫీల్డ్స్ లీడర్‌గా నిలుస్తుందని, ఏరోస్పైక్ ఇంజిన్‌తో సామర్థ్యం మెరుగుపడటమే కాకుండా, తక్కువ ఖర్చుతో కూడుకొన్నదని పేర్కొన్నారు.

అమెరికాను కనుగొన్నది భారతీయులే

మధ్యప్రదేశ్ మంత్రి పర్మార్

భోపాల్: అమెరికాను కనుగొన్నది క్రిస్టోఫర్ కొలంబస్ కాదని, భారతీయ పూర్వీకులేనని మధ్యప్రదేశ్ విద్యాశాఖ మంత్రి ఇందర్‌సింగ్ పర్మార్ వ్యాఖ్యానించారు. భారత్‌ను కనుగొన్నది వాస్కోడిగామా అన్నది కూడా తప్పేనని అన్నారు. ‘భారత గొప్ప యోధుడైన వాసులూన్ 8వ శతాబ్దంలోనే అమెరికాకు వెళ్లారు. శాంటియాగోలో అనేక దేవాలయాలు నిర్మించారు. ఇప్పటికీ ఆ నిజాలు అక్కడి మ్యూజియంలో భద్రంగా ఉన్నాయి. వాస్కోడిగామా భారత్‌ను కనిపెట్టాడన్నదీ తప్పే, పుస్తకాల్లో తప్పుగా రాశారు’ అని పేర్కొన్నారు.

భారత్‌లో 1000 మంది ఉద్యోగులపై శాంసంగ్ వేటు!

ప్రపంచవ్యాప్తంగా 30% మందికి ఉద్వాసన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థ శాంసంగ్ పెద్దయెత్తున ఉద్యోగులను తొలగించడానికి ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ ఏడాది చివరి నాటికి ప్రపంచవ్యాప్తంగా 30 శాతం మంది ఉద్యోగులను ఇంటికి పంపించేయడానికి నిర్ణయించినట్టు రైటర్స్ సంస్థ వెల్లడించింది. అమెరికా, యూరప్, ఆసియా, ఆఫ్రికా రీజియన్స్‌లోని సేల్స్, మార్కెటింగ్, అడ్మినిస్ట్రేషన్ విభాగాల సిబ్బందిని ఎక్కువగా తొలగించే అవకాశం ఉంది. భారత్‌లో వెయ్యి మందికి ఉద్వాసన పలకవచ్చు. ఈ తొలగింపులు ఈ ఏడాది ఆఖరుకు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కాగా, దీనిపై శాంసంగ్ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ సిబ్బంది సర్దుబాటు సహజ ప్రక్రియేనని, పని సామర్థ్యం పెంచడానికే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. స్మార్ట్‌ఫోన్‌లు, టీవీలు, గృహోపకరణాలు, మెమరీ చిప్స్ వంటివి తయారు చేసే అగ్రగామి సంస్థ శాంసంగ్‌లో ప్రపంచ వ్యాప్తంగా 2,67,800 మంది సిబ్బంది ఉన్నారు.

70 ఏండ్లు పైబడిన వారికీ
ఆయుష్మాన్ భారత్

- ఆదాయంతో సంబంధం లేకుండా అందరికీ వర్తింపు
- ఈవీల ప్రోత్సాహకానికి 10 వేల కోట్లతో పీఎం ఈడ్రైవ్
- కేంద్ర మంత్రివర్గం నిర్ణయాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: దేశంలో 70 ఏండ్లు పైడిన అందరికీ ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన వర్తింపజేయాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. బుధవారం మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఆదాయంతో సంబంధం లేకుండా 70 ఏండ్ల వయసు పైబడిన అందరికీ ఏడాదికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సేవలను అందించనున్నట్టు ఆయన తెలిపారు. దీని ద్వారా 4.5 కోట్ల కుటుంబాలు లబ్ధి పొందుతాయని చెప్పారు.

హైడ్రోపవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి 12వేల కోట్లు

ఎలక్ట్రిక్ బస్సులు, అంబులెన్సులు, ట్రక్కులు సహా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రూ.10,900 కోట్లతో రెండేండ్ల పాటు పీఎం ఈ-డ్రైవ్ పథకాన్ని అమలు చేయాలని క్యాబినెట్ నిర్ణయించినట్టు తెలిపారు. దేశంలో రానున్న ఎనిమిదేండ్లలో 31,350 మెగావాట్లతో నూతన జల విద్యుత్తు కేంద్రాల నిర్మాణానికి రూ.12,461 కోట్లు కేటాయించాలని క్యాబినెట్ నిర్ణయించినట్టు చెప్పారు.

నాలుగో విడత గ్రామ్ సడక్ యోజన

2024-25 నుంచి 2028-29 ఆర్థిక సంవత్సరాల మధ్యకాలంలో ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన-4 అమలు చేయాలని క్యాబినెట్ నిర్ణయించినట్టు అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. దీని ద్వారా 25 వేల ఆవాసాలకు రోడ్డు సదుపాయం కల్పించేందుకు 62,500 కిలోమీటర్ల మేర రోడ్లను, కొత్త వంతెనలను నిర్మించనున్నట్టు తెలిపారు. మొత్తం రూ.70,125 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ పథకంలో రూ.49,087 కోట్లు కేంద్రం భరిస్తుందని, మిగతాది రాష్ట్రాలు భరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

విదేశీ విద్యపై సంపన్నుల మోజు

ముంబై: భారత్‌లోని సంపన్న, ఎగువ మధ్యతరగతి వర్గాలలో నాలుగింట మూడొంతుల మంది తమ పిల్లలను విద్యాభ్యాసం కోసం విదేశాలకు పంపుతున్నారని ఓ సర్వే నివేదిక వెల్లడించింది. కోటి రూపాయల నుంచి రూ.17 కోట్ల మధ్య పెట్టుబడి మిగులు ఉన్న 1,456 మంది సంపన్నులను ‘గ్లోబల్ క్వాలిటీ ఆఫ్ లైఫ్ 2024’ సంస్థ గత మార్చి నెలలో సర్వే చేసింది. వీరిలో 78 శాతం మంది తమ పిల్లలను చదువుకోసం విదేశాలకు పంపేందుకు ఆసక్తి కనబరిచారు. వీరిలో ఎక్కువమంది తమ పిల్లలను ప్రాధాన్య క్రమంలో అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, సింగపూర్ దేశాలకు పంపేందుకు ఇష్టపడుతున్నట్టు వెల్లడించింది. కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను విదేశాలకు పంపేందుకు ఆర్థిక ఇబ్బందులను సైతం ఎదుర్కొనేందుకు సిద్ధపడుతున్నారని తెలిపింది. చాలామంది ఉద్యోగ విరమణ తరువాత బతకడం కోసం దాచుకున్న డబ్బును సైతం తమ పిల్లల చదువుకోసం వెచ్చిస్తున్నారని పేర్కొంది.

ట్రంప్‌పై కమలదే పైచేయి!

వాడీవేడిగా తొలి డిబేట్

న్యూయార్క్: నవంబర్‌లో జరిగే అగ్రరాజ్య ఎన్నికల సందర్భంగా జరిగిన డిబేట్‌లో డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్, మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తొలిసారిగా ముఖాముఖీ తలపడ్డారు. గత డిబేట్‌లో ట్రంప్ వైపే స్పష్టంగా మద్దతు చూపిన మీడియా, ఈసారి మాత్రం కమలా హారిస్‌కు ఎడ్జ్ ఇచ్చింది. మంగళవారం రాత్రి వీరిరువురికి మధ్య జరిగిన సంవాదంలో ఆర్థిక వ్యవస్థ, గర్భ విచ్ఛిత్తి నుంచి వలస విధానం వరకు పలు అంశాలపై వాడీవేడిగా చర్చ జరిగింది. 90 నిముషాల పాటు జరిగిన ఈ చర్చలో హారిస్ కొన్ని సమయాల్లో సంభాషణను నియంత్రించారు. ట్రంప్‌ను అతని ఆర్థిక విధానంలోని లోపాలను ఎత్తి చూపారు. అలాగే 2020 ఎన్నికల్లో పరాజయాన్ని ట్రంప్ అంగీకరించడానికి నిరాకరించడం, సభలలో అతని వ్యవహార శైలిపై చురకలంటించారు. అయితే ట్రంప్ పలుసార్లు అసంబద్ధ వ్యాఖ్యలు చేశారు. సమయం గడిచే కొద్దీ ఆయనలో చికాకు కన్పించింది. హారిస్ ఆరోపణలను సమర్థించుకోవడానికి ఎక్కువ సమయం కేటాయించినట్టు కన్పించగా, హారిస్‌లో దృఢ విశ్వాసం, దూరదృష్టి కన్పించాయని పలువురు వ్యాఖ్యాతలు పేర్కొన్నారు. గత జూన్‌లో ట్రంప్‌తో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ జరిపిన సంవాదం కన్నా హారిస్ చక్కగా తన వాగ్ధాటితో ఆకట్టుకున్నారు. అప్పటి సంవాదంలో పలుసార్లు బైడెన్ తడబడగా, హారిస్ మాత్రం సూటిగా సమాధానం చెబుతూ తనకు, ట్రంప్‌కు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రస్ఫుటింప చేశారు.

కమల ఇయర్ రింగ్స్‌లో సీక్రెట్ డివైస్!

డిబేట్ సమయంలో కమల ఇయర్ రింగ్స్‌లో రహస్య వినికిడి పరికరం ఉందని ఆరోపణలు వస్తున్నాయి. టెక్నాలజీకి సంబంధించిన ఓ వ్యాసంలో ఓ మహిళ ధరించిన కర్ణాభరణం వంటి ఇయర్‌పీస్‌తో కమల ధరించిన ఇయర్ రింగ్స్‌ని పోల్చి చూపిస్తున్నారు. ‘ట్రంప్‌తో చర్చలో కమల బాగా మాట్లాడారు. కానీ ఆమె కర్ణాభరణాలు నాకు ఆసక్తికరంగా మారాయి. అవి చెవి రింగుల మాదిరిగా కనిపించే ఓ ఇయర్‌ఫోన్ గురించి ఓ టెక్ ఆర్టికల్ గుర్తుకు వచ్చింది’ అని ఓ ఎక్స్ యూజర్ పేర్కొన్నారు.

అదానీ.. గో బ్యాక్

- మోదీ ఆప్తమిత్రుడిపై కెన్యాలో పెద్ద ఎత్తున నిరసనలు
- అదానీ సంస్థకు జోమో కెన్యట్ట విమానాశ్రయ లీజు
- వ్యతిరేకిస్తూ సమ్మెకు దిగిన ఎయిర్‌పోర్టు కార్మికులు
- నిలిచిన విమానాలు.. స్తంభించిన కార్యకలాపాలు
- ఒప్పందంపై తాత్కాలిక స్టే విధించిన హైకోర్టు

నైరోబి, సెప్టెంబర్ 11: దేశంలోని అనేక నౌకాశ్రయాలు, విమానాశ్రయాలను హస్తగతం చేసుకున్న అదానీ సంస్థ విదేశాలకు విస్తరించేందుకు చేస్తున్న ప్రయత్నాలకు తీవ్ర అడ్డంకులు ఎదురవుతున్నాయి. కెన్యాలో అదానీ సంస్థకు వ్యతిరేకంగా వందలాది మంది ఎయిర్‌పోర్టు కార్మికులు ఆందోళనకు దిగారు. రాజధాని నైరోబిలోని జోమో కెన్యట్ట అంతర్జాతీయ విమానాశ్రయాన్ని(జేకేఐఏ) అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ లిమిటెడ్‌కు లీజుకు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం రాత్రి కెన్యా ఏవియేషన్ అథారిటీ(కేఏఏ) కార్మికులు సమ్మెకు దిగారు. ‘అదానీ.. గోబ్యాక్’, ‘వీ రిజెక్ట్ అదానీ’ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అదానీతో ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని ప్రభుత్వాన్ని కార్మికులు డిమాండ్ చేశారు. ఎయిర్‌పోర్టును అదానీకి అప్పగించడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. కార్మికుల సమ్మెతో ఎయిర్‌పోర్టు కార్యకలాపాలు స్తంభించిపోయాయి. విమానాల రాకపోకలు ఆలస్యం అవుతున్నాయి. టెర్మినల్ బయట ప్రయాణికులు బారులు తీరుతున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కాగా, ఈ ఒప్పందంపై అభ్యంతరాల నేపథ్యంలో కెన్యా హైకోర్టు తాత్కాలిక స్టే విధించింది.

- *2016 జూలై 10, 11 తేదీల్లో కెన్యాలో మోదీ పర్యటన*
- *2023 డిసెంబర్ 4 - 6 మధ్య భారత్‌లో కెన్యా అధ్యక్షుడు పర్యటన*
- *2024 జూలైలో ఎయిర్‌పోర్టు నిర్వహణకు అదానీ సంస్థ ప్రతిపాదన, వెంటనే ఆమోదం*

ఏమిటీ ఒప్పందం?

జోమో కెన్యట్ట అంతర్జాతీయ విమానాశ్రయం కెన్యాలో ప్రధానమైనది. దాదాపు 185 కోట్ల డాలర్లకు ఈ ఎయిర్‌పోర్టును 30 ఏండ్ల పాటు అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ లిమిటెడ్ సంస్థకు లీజుకు ఇచ్చేందుకు కెన్యా ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. సామర్థ్యానికి మించి ఎయిర్‌పోర్టుకు ప్రయాణికులు వస్తున్నందున ఆధునీకరించేందుకు ఈ ఒప్పందం చేసుకున్నట్టు కెన్యా ప్రభుత్వం చెప్పింది. ఒప్పందంలో భాగంగా అదానీ సంస్థ రెండో రన్‌వేను నిర్మించడంతో పాటు ప్రయాణికుల టెర్మినల్‌ను ఆధునీకరించాలి. అయితే, పబ్లిక్ టెండర్‌ను ఆహ్వానించకుండా అదానీ సంస్థ చేసిన ప్రతిపాదన ఆధారంగా ఈ ఒప్పందం ఖరారైంది.

నైరోబిలో అదానీ సంస్థకు వ్యతిరేకంగా కార్మికుల నిరసన

ఒప్పందాన్ని ఎందుకు దాచిపెడుతున్నారు?

నైరోబీ ఎయిర్‌పోర్టును అదానీకి అప్పగించేందుకు కెన్యా ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని రహస్యంగా ఉంచుతున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. అన్ని వివరాలను ప్రభుత్వం తమకు ఇవ్వడం లేదని, ఎందుకు ఒప్పంద వివరాలను రహస్యంగా ఉంచుతున్నారని కెన్యా ఏవియేషన్ వర్కర్స్ యూనియన్ సెక్రటరీ జనరల్ మోసెస్ ప్రశ్నించారు. ఎయిర్‌పోర్టు ప్రభుత్వ ఆస్తి అని, కెన్యా ప్రజలకు నిజాలు తెలియాలని కినాంగాప్ ఎంపీ క్వెన్యా థుకు పేర్కొన్నారు. రాయితీల ద్వారా ఎయిర్‌పోర్టు కార్యకలాపాలు సాగుతున్నాయని, ఇప్పుడు అదానీ సంస్థకు ఎయిర్‌పోర్టును అప్పగిస్తే స్థానికులు ఉద్యోగాలు కోల్పోతారని, లాభాల కోసం ఈ సంస్థ ప్రయాణికులను దోచుకుంటుందని ఎయిర్‌పోర్టు కార్మికులు ఆరోపిస్తున్నారు. ‘ఇది మా సార్వభౌమత్వాన్ని అపహాస్యం చేయడమే. అదానీ సంస్థ ఒట్టి చేతులతో వస్తున్నది. మేము అదానీని తిరస్కరిస్తున్నాం’ అని వర్కర్స్ యూనియన్ ప్రకటించింది. ఈ లీజు ఒప్పందాన్ని లా సొసైటీ ఆఫ్ కెన్యా, కెన్యా మానవ హక్కుల కమిషన్ కోర్టులో సవాల్ చేశాయి. ఒప్పందంపై తాత్కాలిక స్టే విధించిన కోర్టు తుది తీర్పు వెలువరించాల్సి ఉంది.

మొన్న ఆస్ట్రేలియా, శ్రీలంక.. నిన్న బంగ్లాదేశ్.. నేడు కెన్యా

గత పదేండ్లుగా భారత్‌లో అనేక రంగాలకు వ్యాపారాన్ని విస్తరించిన అదానీ సంస్థలు విదేశాల్లోనూ అడుగుపెట్టాయి. పలు దేశాలతో ఇంధన, విద్యుత్తు, మైనింగ్, విమానాశ్రయాలకు సంబంధించిన ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. అయితే, ఈ ఒప్పందాలపై ఆయా దేశాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. శ్రీలంకలోని మన్నార్ జిల్లాలో నిర్మించాలనుకున్న పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులపై అక్కడి ప్రజలు భగ్గుమన్నారు. 2022లో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన అల్లర్లకు ఇదీ ఓ కారణం. అదానీ నుంచి విద్యుత్తు కొనుగోలు కోసం బంగ్లాదేశ్ ప్రభుత్వం ఒప్పందం చేసుకోగా, దీనిపైనా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అంతకుముందు ఆస్ట్రేలియాలోనూ అదానీ మైనింగ్ ప్రాజెక్టుపై ఆందోళనలు జరిగాయి. ఇప్పుడు కెన్యాలోనూ ఇదే జరుగుతున్నది.